# స్నేహ బంధం

'నిన్నే, తొందరగా తెమిలి బయటపడు...'

స్నానం చేస్తున్న కూతుర్ని ఉద్దేశించి తల్లి అన్న మాటలివి. బదులేమీ రాకపోవడంతో, ఈసారి ఆమె మాటల్లో అసహనం గూడు కట్టుకుంది.

'బాత్‌రూంలోంచి తొందరగా వూడిపడవ్...నీ కోసం హాల్లో నీరు నాలుగైదు నిమిషాలుగా ఎదురు చూస్తోంది...'

'ఎవరు?' నూతిలో గొంతుకలా ప్రత్యుత్తరం వినవచ్చింది.

'నీ కోసం యింకెవరొస్తారు? నీ చెలికత్తె...' అంతే. బాత్‌రూం తెరిచిన సవ్వడి అయింది. తడిపొడిగా వున్న ఒంటి మీద జాకెట్టుకి ఒక కొక్కెం మాత్రం బిగించి, ఓణీ వేసుకుంటూ, 'నీరూ వచ్చిందా?' అడిగింది తల్లిని. మాటల్లో ఆప్యాయత, ఆతురత కలబోసుకున్నాయి.

'నీ చెలికత్తె అన్నానుగా' ప్రసన్నంగా పలికిన తల్లి మందలిస్తున్నట్టుగా చెప్పింది. 'సరిగా ఓణీ వేసుకో. జాకెట్టుకి హుక్సు వేసుకో...' తల్లి మాటలేవీ వినిపించినట్టు లేదు కూతురికి. సరాసరి హాల్లోకి వచ్చి, 'ఎప్పుడొచ్చావే... నీతో మాట్లాడి కొన్ని యుగాలయినట్టుగా వుంది నీరూ...' అంది, ఒళ్లంతా కళ్ళు చేసుకుని.

నీరు కైతే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అమాంతం కౌగిలించుకుంది స్నేహితురాల్ని. స్నేహమాధురి అంటే యేమిటో ఆ యువతులకు తెలిసినంతగా మరొకరికి తెలియదేమో అనిపించింది.

'నిమ్మీ, నిజమనుకో... ఆ పట్టణం కాలేజీ నాకేమీ నచ్చలేదు...'

'అదేమిటే నీరూ, అలా అంటావ్! ఆ కాలేజీ గురించి అంతా గొప్పగా చెప్తారు...'

రెండు పెసరట్లు ప్లేట్లతో తల్లి వస్తుంటే చూసి, ఆమెకు సహాయంగా నిమ్మిలేచి వెళ్లింది. మంచి నీళ్లగ్లాసులు తెచ్చి, ఆ ప్లేట్ల పక్క ఉంచింది.

'నువ్వు వెళ్లినప్పటినుంచీ మా నిర్మల ఎవరితోను మనసు విప్పి మాట్లాడలేదు. ఇంట్లో మాతోకూడా సరిగ్గా మాట్లాడదు. ఎప్పుడూ ముభావంగా వుంటుంది...'

'అవునా నిమ్మీ..'

'నీరజకైనా చెప్పవే అమ్మా, అసలు కారణం...'

'మా అమ్మ మాటలు నీకు తెలుసుగా నీరూ' అని మౌనం వహించింది.

'నాకు చెప్పద్దు. స్నేహితురాలికైనా చెప్పు...' అంటూ లోపలికి వెళ్లిపోయింది.

'నిమ్మీ, నీ బాధ నాకు తెలుసు. మన వూళ్లో డిగ్రీ కాలేజి లేకపోవడం మూలాన, నీ చదువుకి అంతరాయం కలిగింది. అది తలుచుకుని నేనెంత బాధ పడుతున్నానో నీకు తెలీదు...'

'తెలీకే. నీరూ... పట్టణానికి వెళ్లేరోజున, నువ్వు మా నాన్నగారితో ఎలా వాదించావో నాకు తెలుసు. హాస్టలు ఖర్చు భరించలేనని ఆయనంటే, ఆ ఖర్చు నేను భరిస్తానని నువ్వు ముందుకి వచ్చావు...'

'ఇప్పుడూ నేను ఆ మాటమీదే నిలబడుతున్నా. నీ కోసం ఆ మాత్రం నేను చెయ్యకూడదా చెప్పు! నువ్వు నాకు అక్కయ్యలాంటి దానివి...'

'నీరూ...' అంటూ నిర్మల నీరజ ఒళ్లో తలదాచుకుంది.

'నిమ్మీ, ఏడుస్తున్నావా?'

'నాకు చదువుకోవాలనుంది...కాని...'

'కాని అంటే!'

'మా కుటుంబ పరిస్థితి అడ్డు తగులుతోంది.' నిమ్మీ దీనంగా చెప్పింది. కళ్లు తుడుచుకుంటూ యిలా అంది. 'మా నాన్న గారికి మిల్లు వచ్చే జీతం నీకు తెలుసుగా! అది చాలడం లేదు. మా చెల్లెల్ని చదివించాలి. మా అన్నయ్యకేమో యింకా ఎక్కడా ఉద్యోగం రాలేదు. అయినా ప్లస్‌టూ చదివిన వాడికి యీ రోజుల్లో ఎవరిస్తారు చెప్పు వుద్యోగం?'

రెండు క్షణాలు యిద్దరూ మాట్లాడలేదు.

'నీరూ, నీకు గుర్తుందా? మనం టెన్త్ ప్యాసయిన రోజుల్లో ఒక నాడు పేపరు చదువుతూ..ఆర్థికస్తోమత కారణంగా ఆగిపోయిన చదువు... అనే ఒక శీర్షిక చూశాం. చదువుకి ముఖ్యంగా కావలసింది అభిలాష, పట్టుదల అని నేను వాదించాను. నువ్వేమో కాదు, కాదు... ధనం ముఖ్యావసరం అని వాదించావు. నువ్వే గెలిచావు నీరు...'

'కాదు నిమ్మీ, నువ్వే గెలిచావు చివరికి...'

ఆశ్చర్యంగా నిర్మల నీరజను చూసింది.

'నీ పట్టుదలనీ నీ అభిలాషనీ చూసే కొద్దీ, యీ విషయం మా నాన్నగారితో డిస్కస్ చెయ్యాలని నా కనిపిస్తోంది. అందువల్ల నీ కోరిక నెరవేరుతుందని నా నమ్మకం...'

'నీరూ, యీ విషయం మీ నాన్నగారిదాకా పోనివ్వకు. మనిద్దరిలోనే వుండడం మంచిది... మీ నాన్న గారి సహాయం వల్ల నేను ప్లస్ టూ అయినా పూర్తి చెయ్యగలిగాను...' అంది, కృతజ్ఞత మాటల్లో స్పష్టమయ్యేలా.

'అయితే నిమ్మీ యిప్పుడు నువ్వేం చేస్తున్నావ్?' నీరజ మాటవరసకి అడగలేదు.

'ఏముంది పొద్దున తెలుగు, ఇంగ్లీషు టైప్ క్లాసెస్... సాయంకాలం టైలరింగ్...ఎక్కడైనా వుద్యోగమంటూ దొరికితే, టైపిస్ట్‌గా చేరాలని కోరిక. ఇదైనా నెరవేరుతుందో లేదో!...' అంటూ నిర్మల గబగబ గదిలోకి వెళ్లి కాగితం పాకెట్‌తో తిరిగి వచ్చింది. 'కుట్టడం నేర్చుకున్న తర్వాత, యిదే నేను కుట్టిన మొట్టమొదటి లోపావడ.' నిర్మల మాటల్లో చూపుల్లో ఎంత సంతోషమని!

అది చూస్తూ నీరజ తాను స్వయంగా కుట్టినంతగా మురిసిపోయింది.

'నీరూ, యిది నీకే... తీసుకోవా... ప్లీస్...' ప్రాధేయపడుతున్నట్టుగా అడిగింది.

కోపం నటిస్తూ నీరజ, 'తీసుకోను' అంది.

'తీసుకోవే' నిర్మల గదమాయించింది.

'ఇప్పుడు తీసుకుంటాను.'

ఇంత స్వతంత్రంగా ఆప్యాయంగా మాట్లాడేందుకు నిమ్మీ తప్ప నాకెవరున్నారు చెప్పు! పట్టణంలో కాలేజీ హాస్టల్లో వుంటున్నా నన్నుమాటేగాని జైల్లో వుంటున్నట్టుగా వుంది. నీరజ నిర్మలను గట్టిగా కౌగిలించుకుంది. ఏదో అలికిడి అయినట్టుగా విని నీరజ కౌగిలి సడలించింది. ఎవ్వరూ లేరు! అక్కడికక్కడే నిమ్మీ యిచ్చిన ఆ లోపావడా ధరించింది.

'ఇప్పుడు నా కెంత సంతోషంగా వుందో చెప్పలేను...'

'ఈ మాత్రానికే నువ్వు సంతోషిస్తే నేను వూరుకోను. నా జాకెట్టు నువ్వే కుట్టాలి...'

'తప్పకుండా'

నిర్మల నీరజను చూస్తూ, 'మన అభిమానాలు యిలాగే వుండిపోవాలి... పెళ్ళికి తర్వాత కూడా...' అంది, ముక్కు తెగపీలుస్తూ.

నీరజ కళ్లు చెమ్మగిల్లాయి.

'మీరిద్దరూ మాటల్లో పడితే గడియారం కూడా ఆగిపోతుంది...' నవ్వుతూ చెప్పింది నిర్మల తల్లి. అప్పుడే ఆమె హాల్లోకి వచ్చింది.

నీరజ కళ్లు నలుపుకుంటుంటే, గోడ గడియారం పన్నెండు కొట్టింది.

'నీరమ్మగోరు...' బయటి నుంచి కేక.

'వెళ్లొస్తాను...' నీరజ లేవపోయింది.

'మీ స్నేహితురాలితో కలిసి నువ్విక్కడే భోజనం చేసి ఆ తర్వాత వెళ్దువు గాని...ఉండమ్మా... నీరమ్మ యిక్కడే భోజనం చేసివస్తుందని అయ్యగారితో చెప్పు, రాముడూ' అంది నిర్మల తల్లి బిగ్గరగా.

అవునన్నట్టుగా నీరజ రాముడితో చెప్పింది. అతడు వెళ్లిపోయాడు.

రోజులు రాకెట్టువేగంతో గడిచే కొద్దీ, నిర్మలకు తమలాంటి మధ్య తరగతి కుటుంబాలంటే అభిమానం తగ్గసాగింది. దర్పానికేం లోటు లేదు! మహా దర్జాగా కాలక్షేపం చెయ్యాలనుకుంటారు. అంతేకాని తమ అసలు పరిస్థితిని బేరీజు వేసుకోరు. పుడితే పేదగా నైనా పుట్టాలి, లేకుంటే

శ్రీమంతుల బిడ్డగా నైనా పుట్టాలి –అనుకుంది. అనుకుని అనుకుని మధ్య తరగతి వారిని ద్వేషించసాగింది. అది ఆగ్రహంగా అసహ్యంగా మారింది. లేకపోతే... తన పెళ్లికోసమని ముందు వెనకలు చూడకుండా లేనిపోని గౌరవమనే ముసుగు చాటున అప్పుచేసి అంత డబ్బు ఖర్చుపెడతారా తల్లిదండ్రులు! తలకు మించిన సంబంధం చూడడం వాళ్లు చేసిన మొదటి తప్పు. అందువల్ల గొప్పలకు పోవడం రెండో తప్పు. పోనీ సంసారభారం మొయ్యలేక మొయ్యలేక మోస్తున్న తన తల్లికైనా యింకా యిద్దరు పిల్లలున్నారనే స్పృహ వుండద్దూ... పెళ్లికి వచ్చిన బంధువులందరికీ చీరెలు పెట్టి గుడ్డలకొట్లో తొందర్లో తీర్చలేనంత పద్దు పెట్టింది. పెళ్లికి ముందూ వెనకా కూడా ఏవి.టే ఖర్చు... అంటూ విసుక్కుంది, నిర్మల. తన మనోవేదన గ్రహించేవారెవరున్నారు? పైపెచ్చు కన్న తల్లి నలుగుర్లోనూ విసుక్కుంది.. శుభమా అని పెళ్లి తలపెట్టినప్పట్నుంచీ ఏమిటే నీ ధుమ ధుమలు, రుసరుసలూ.. మా కష్టసుఖాలు మాకు తెలియవనుకున్నావా.. అంతా నీకే తెలిసినట్టుగా వ్యవహరిస్తున్నావ్... నిర్మల నోటికి తాళం పడింది.

తాను అదృష్టహీనురాలనుకుంది నిర్మల. చదువూ సాగలేదు. టైపు వగైరాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఉద్యోగం చెయ్యలేకపోయింది. పోనీ కట్టుకున్న భర్తయైనా ఘటికుడా అంటే అదీ లేదు. అన్న వస్త్రాలకు లోపం లేని యింట్లో పడింది. ఆ మాత్రం అదృష్టమైనా తనను వరించినందుకు ఏనుగెక్కినంతగా సంబరం చెందింది. తన తల్లిదండ్రుల అప్పులు ఆడంబరాలు గుర్తుకి వచ్చేసరికి ఆ సంబరం కాస్తా మబ్బుల చాటున చంద్రుడు చేరినట్లయింది. పూర్వపు చురుకుదనం తెలివితేటలు యిప్పుడు కలికానికైనా ఆమెలో కనిపించలేదు.

పెళ్లి వైభవంగా ఆడంబరంగా జరగడంతో, పెళ్లికొడుక్కి దుర్బుద్ధులు కలిగాయి. పుట్టింటినుంచి అదితీసుకురా యిది తీసుకురా అంటూ కాపరానికి వచ్చిన భార్యను వేధించుకు తినడం మొదలు పెట్టాడు. అది నిర్మలకు నచ్చలేదు. భర్తమీది ప్రేమ అసహ్యంగా మారింది. అది చాలదూ వైవాహికజీవితం నరకంగా తయారు కావడానికి! జీవిత మంటే యేమిటో

తెలియవచ్చినప్పటినుంచీ ఎదురు దెబ్బలకు అలవాటు పడిన నిర్మలకు ఆ నరకం నుంచి ఎలా బయట పడడమా అని ఒక్కోసారి అని తలపోయ సాగింది. అలా అనుకోవడం వల్ల తనకే తీరని అన్యాయం కలుగుతుందని, ఎలానో భర్త వేధింపుల్ని సహించుకో సాగింది. ఆ వేధింపుల నేపథ్యంలో నీరజ స్వయంగా పంపిన తన వివాహ శుభలేఖ వచ్చింది నిర్మలకు. బొంబాయి సంబంధం వరుడు బాగా చదువుకున్నాడు; మంచి వుద్యోగంలో వున్నాడు. స్నేహితురాలికంటె నిర్మలే ఎంతగానో సంతోషించింది, మంచి సంబంధం నీరజకు కుదిరినందుకు. చదువులో సరస్వతి అనిపించుకున్న తన స్నేహితురాలికి విద్యాధికుడు భర్తకావడం చూసి మురిసిపోయింది. ఎలాగైనా పెళ్లికి వెళ్లాలనుకుంది. భర్తను అడిగింది. ఆ సందర్భంగా కూడా ఆమెకు ఎదురుదెబ్బే తగిలింది. హతాశురాలయింది. కలిగిన బాధను తనలోనే అణుచుకుంది. తండ్రి కూడా వుత్తరం రాశాడు, నీరజ పెళ్లికి వచ్చి వెళ్లమని. ఆ విధంగా నైనా కూతుర్ని చూడవచ్చుననే వుద్దేశంతో. అల్లుడి గొంతెమ్మ కోరికలు వల్ల వాళ్లమధ్య రాకపోకలు తగ్గిపోయాయి. తాను లేని గొప్పలు నటించడం వల్ల తన కూతురు జీవితం దెబ్బ తిన్నదని తండ్రి ఆలస్యంగా గ్రహించాడు. చేతులు కాలాయి. ఆకులు పట్టుకుని ఏం లాభం?

నీరజ పెళ్లి రోజున నిర్మల పడిన బాధ యింతా అంతా కాదు. శుభలేఖను మాటిమాటికి చదువుకుంది. అంతా మనస్సులోనే వూహించుకుంది. తన సూట్‌కేసులో చీరెల మడతల్లోంచి తానూ తన స్నేహితురాలు కలిసి తీయించుకున్న ఫోటో బయటికి తీసి అందులోని నీరజను ముద్దు పెట్టుకుంది. ఒకసారి కాదు ... రెండుసార్లు కాదు...

'ఎవరితో ఆ ముద్దులాటలు...' భర్త కఠోర కంఠ స్వరం వినిపించింది.

నిర్మల అపర కాళి కాలేదు.

'నా స్నేహితురాలు పెళ్లికూతురుగా ఎలా వుంటుందో వూహించుకుని, ఫోటోలో కనిపిస్తున్న ఆ చక్కని చుక్కతో ముద్దాడుతున్నాను.... ఈ భాగ్యమైనా మీరు నాకు కల్పించారు....' అంది, తెచ్చుకున్న నవ్వుతో.

నిర్మల చేతిలోంచి ఫోటో తీసుకుని అతను దీక్షగా చూడసాగాడు. కోపంకొద్దీ అదెక్కడ చింపివేస్తాడో అని భయంభయంగా భర్తను చూసింది.

'నిర్మలా...'

'ఊ...' నీరసంగా బదులు వచ్చింది.

'నా తప్పు తెలుసుకుని విచారిస్తున్నాను... ప్రాయశ్చిత్తం లేదనుకుంటాను.' అన్నాడు తల వంచుకుని. ఆమె నిర్ఘాంతపోయింది.

'ఫోటో చూస్తుంటే మీరిద్దరూ ఎంత ప్రాణస్నేహితులో అర్థమవుతోంది... ఆమె పెళ్లికి నిన్ను పంపకపోవడం వల్ల ఎంత తప్పు చేశానో తెలుసుకున్నాను...' దీనంగా చూశాడు.

'బొంబాయి నుంచి పుట్టింటికి వచ్చిన తర్వాత కలుసుకుంటా. వెండి నా చెల్లెల్ని...'

'నా కోసం ఒక్కపని చెయ్యవా నిర్మలా...' ఆశ్చర్యంగా చూసింది భర్తను.

'పెళ్లికి నిన్ను పంపనందుకు నేనిప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నానని మీ స్నేహితురాలికి వివరంగా వుత్తరం రాయవా.. అదే నిన్ను కోరుతున్నది.'

'మీలో యీ మార్పు వస్తుందని నేను కల్లో కూడా అనుకోలేదు... నీరజ లాంటి స్నేహితురాలు దొరకడం నా అదృష్టం. ఆమెను చూస్తే మీరే యీ మాట చెపుతారు.' నిర్మల భర్తను ప్రేమగా చూస్తూ చెప్పింది.

'నువ్వింతగా చెపుతుంటే నాకూ అలాగే అనిపిస్తోంది. నువ్వు అదృష్టవంతురాలివే నిజంగా... నా కిన్నేళ్లు వచ్చినా ప్రాణస్నేహితుడని చెప్పుకోదగిన మిత్రుడు నాకు లేడు...'

ఒకరోజు భర్త ఆఫీసు నుంచి రాగానే, కాఫీ గ్లాసు అందిస్తూ, 'మీరు త్వరలో తండ్రి కాబోతున్నారండి' అంది నిర్మల, ఏకకాలంలో సిగ్గూ సంతోషం చెందుతూ.

కాఫీ తాగడం మానేసి అమాంతంగా భర్యను కౌగిలించుకున్నాడు. కృతజ్ఞతా పూర్వకంగా ఆమె చూశాడు. 'అదేం చూపండి...' అంది సిగ్గు పడుతూ.

'మీ నాన్నగారికి నేనే రేపు వుత్తరం రాస్తాను.'

'మీరా!'

'నేనే... రాయకూడదా!'

'అని కాదు... పెళ్లయినప్పటినుంచీ అది కావాలి యిది కావాలంటూ ఆయన్ని వేధించుకు తిన్నారుగా... సంతోషం లేకుండా చేశారు...'

'ఆ పాప పరిహారార్థం నేనే ఆయనకి యీ శుభవార్త తెలుపుతాను.' అన్నాడు మొండిగా.

ఆమెకు భర్తలో ఒక వెర్రిబాగులవాడు గోచరించాడు. ప్రేమ ముద్దవంటి ఒక సహృదయుడు కనిపించాడు. 'జీవితమాధుర్య మంటే యేమిటో యిప్పుడే నాకర్థమయింది...' అంది.

'అంటే?' అన్నట్టుగా అతను ఆమెను పరికించాడు.

'ఇంత కాలానికి మన మనస్సులు ఏకమైనాయి...'

'ఇంత కాలం ఆ మాధుర్యాన్ని నిరోధించిన యీ సైంధవుణ్ణి యేంచేసినా తప్పులేదు...'

వరదలా వచ్చిన ఆ నవ్వుని ఆమె ఆపుకోలేక పోయింది. ఆ రాత్రి నిమిషాలలో గడిచిపోయినట్టు ఆ దంపతులు భావించారు.

పురిటికి నిర్మల పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రులు వచ్చిన తీసుకు వెళ్లారు. అంతవరకూ సంతోషంగా గంభీరంగా ఉండిన నిర్మల భర్త, ఆమె రైలెక్కుతుంటే కంట తడిపెట్టాడు. పమిటతో ఆమె కళ్లు తుడుచుకుంది. ఆ దృశ్యం చూసి నిర్మల తల్లిదండ్రులు పురాస్మృతులలో మునిగిపోయారు.

పుట్టింటికి వెళ్లిన మరుక్షణమే నిర్మల చెల్లెల్ని వెంటబెట్టుకుని నీరజ వాళ్లయింటికి వెళ్లింది.

నిర్మలను చూసీ చూడగానే, నీరజ తల్లికి దుఃఖం పొంగి వచ్చింది. 'నీరుకి అన్యాయం చేశామమ్మా...' అంటూ విలపించసాగింది. ఆ తల్లి బాధను కళ్లారా చూసిన నిర్మల నిగ్రహశక్తి కోల్పోయింది.

'ఇప్పుడు నువ్వు కంట తడిపెట్టడం మంచిదికాదమ్మా. సంతోషంగా వుండాలి...' ఓదార్పు మాటలు వినవస్తున్నా, నిర్మల యేడుస్తూ అడిగింది. 'ఆయన మంచివాడు కాదా?'

'సంబంధం మంచిదని అందరూ అంటే మురిసి పోయాముగాని, అతగాడికి లేని దురలవాటంటూ యేదీ లేదట... మేనకోడల్ని యింట్లోనే వుంచుకున్నాడట... ఆ యింట్లో తానొక దాసీ నంటూ నీరూ మొన్న ఉత్తరంలో రాయలేక రాసింది.. ఇదంతా మేము చేసుకున్న పాపఖర్మ...'

అవిణ్ణి ఓదార్చడానికి విశ్వప్రయత్నం చేసింది నిర్మల. రోజులు గడుస్తున్నాయి.

ఒకనాటి రాత్రి నిర్మల కవలపిల్లల తల్లి అయింది. ఇద్దరూ మగపిల్లలు. ఆమె అంత సంతోషంగా లేదు. కుమిలిపోతున్నట్టు కనిపించేది. 'అసలే పచ్చి ఒళ్ళు. అలా వుండకూడదమ్మా..' అన్న తల్లి మాటను కూడా పట్టించుకోలేదు. దిండు కింద వుంచుకున్న నీరజ ఫోటోని మాటిమాటికి బయటికి తీసి అదే పనిగా చూసేది... కంట తడిపెట్టేది. తనలో తాను మాట్లాడుకునేది.

మూడో నెలలో నిర్మలను తీసుకువెళ్ళడానికి భర్త వచ్చాడు. ప్రయాణానికంతా సిద్ధమయింది. నిర్మల ఆటో యెక్కబోతుంటే ఒక కారు పక్కగా వెళ్లింది. ముందుకు వెళ్లిన కారు క్షణాలలో వెనక్కి వచ్చి ఆటోకి పక్కగా ఆగింది.

'నిమ్మీ, ఎలా వున్నావే...' కారులోంచి కేక వినవచ్చింది. డోర్ తెరిచిన సవ్వడి, నీరజ దిగడం ఒకే సమయంలో జరిగాయి. వెంట నీరజ తండ్రి వున్నాడు, విచారంగా కనిపిస్తూ.

స్నేహితురాల్ని చూడగానే నిర్మలకు ఏడుపు కట్టలు తెంచుకుని వచ్చింది.

'ఎంత బావున్నారే పిల్లలు...రత్నాలు...'అంది నీరజ, కవలల్ని చూస్తూ. 'నా దిష్టే తగిలేలా వుంది...'

'నీరూ...' నిర్మల మాట్లాడలేకపోయింది. పక్కనే వున్న భర్త సముదాయించాడు.

'నిమ్మీ ఇప్పుడు నువ్వు నాకు భిక్ష పెట్టాలి...' నీరజకు మతిభ్రమించిందా అనుకున్నారు, నిర్మలతో సహా.

'అవును నిమ్మీ... ఒక రత్నం నా కివ్వవూ...'

తెల్లబోతూ నిర్మల స్నేహితురాల్ని చూసింది.

'మన కులాలు వేరని సందేహిస్తున్నావా?'

'నీరూ, నీ విషయంలో ఆ సంగతి నేను మరచిపోయి చాలా రోజులయింది...' నిర్మల అనేసరికి, ఎక్కడలేని సంతోషం తెచ్చుకుని, 'మన స్నేహం కలకాలం నిలిచివుండాలి నిమ్మీ...' అంది నీరజ.

'లోపలికి వెళ్లి మాట్లాడుకుందాం' అన్నాడు నిర్మల భర్త, నీరజను ఆదరభావంతో చూస్తూ.